సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
బుధవారం । 23 । అక్టోబర్ । 2024



భవితకు పునాది

ఒక భవనాన్ని నిర్మించేటప్పుడు పునాది బలంగా వేయాలి. అప్పుడే ఆ పునాదిపై ఎన్ని అంతస్తుల నిర్మాణమైనా చేయవచ్చు. ఇదే విధానం విద్యాభ్యాసంలో విద్యార్థికి వర్తిస్తుంది.


8లో



కమనీయం.. బ్రహ్మోత్సవం

వాడపల్లిలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా కొనసాగాయి. మంత్రోచ్చారణ మధ్య భక్తజన కోటి తన్మయత్వంతో వేడుకలను తిలకించింది.

39వేల క్యూసెక్కుల మిగులు జలాలు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం సాయంత్రం 39,347 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజ్ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 7,800 క్యూసెక్కులు విడుదల చేశారు.

న్యూస్‌రీల్

పాఠశాలల నిర్వహణ నిధులను చెల్లించాలి



సమావేశానికి హాజరైన పీఆర్‌టీయూ ప్రతినిధులు

మామిడికుదురు: పాఠశాలల నిర్వహణ నిధులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు దీపాటి సురేష్‌బాబు డిమాండ్ చేశారు. గోగన్నమఠం యూపీ స్కూల్లో మంగళవారం పీఆర్‌టీయూ జిల్లా శాఖ సమావేశం జరిగింది. ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణ తరగతులను ఫేజ్–2 నుంచి జిల్లా కేంద్రంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సమావేశం కోరింది. అలాగే జీఓ 117 రద్దు ప్రక్రియను వేగవంతం చేయాలని, ఐఆర్ 30 శాతాన్ని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని, హైస్కూల్ ప్లస్‌లకు కావాల్సిన సౌకర్యాలను కల్పించాలని, పీఎఫ్, ఏపీజీఎల్ఐ, మెడికల్ రీయింబర్సుమెంట్ వాయిదాలను చెల్లించాలని, పెరుగుతున్న యాప్‌ల భారాన్ని తగ్గించాలని సభ్యులు డిమాండ్ చేశారు. సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.అమృతరావు, సంయుక్త కార్యదర్శి వి.శ్రీనివాస్, మండల శాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో అప్రెంటిస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ సిటీ: ఏపీఎస్ ఆర్టీసీలో అప్రెంటిస్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కాకినాడ జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని అమలాపురం, రాజమహేంద్రవరం, కాకినాడ డిపోల్లో డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, వెల్డర్లకు సంబంధించి ఖాళీలున్నాయన్నారు. ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులు వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 31లోగా డిపోల వారీగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆయా తేదీల్లో ఉదయం 10 గంటలకు విజయనగరంలోని వీటీ అగ్రహారంలో ఉన్న జోనల్ స్టాఫ్ ట్రెనింగ్ కాలేజీకి హాజరు కావాలన్నారు. సర్టిఫికెట్ల పరిశీలనకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాల అభ్యర్థులు నవంబర్ 8న హాజరు కావాలన్నారు. వివరాలకు 08922–294906 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

ఆధునికత పేరుతో ఆచారాలు వదలొద్దు

ప్రవచన కర్త డాక్టర్ గరికపాటి



తాళ్లపూడిలో ప్రసంగిస్తున్న గరికపాటి నరసింహారావు

తాళ్లపూడి: ప్రస్తుత సమాజంలో ఆధునికత పేరుతో ఆచార, సంప్రదాయాలను వదిలిపెడుతున్నారని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, ప్రవచన కర్త డాక్టర్ గరికపాటి నరసింహారావు అన్నారు. స్థానిక నవదుర్గ, శ్రీచక్ర సహిత కనకదుర్గమ్మ ఆలయంలో మహా కుంభాభిషేకం శత చండీ యాగం మహోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి ఆమర ప్రవచన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ అహంకారం ఉండరాదని, ఉన్న దానితోనే సంతృప్తి చెందాలన్నారు. పిల్లలను సరైన మార్గంలో పెంచాలని హితవు పలికారు. ప్రతి వ్యక్తిలో దైవం ఉన్నాడని చెప్పిన ఏకైక మతం హిందూ మతమని చెప్పారు. ఆధ్యాత్మిక యాత్రలు చేయడం కాదని, మనలో మార్పు రావాలన్నారు. ఆనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా ఆయనను సత్కరించారు.

అంతా గ్యాసేనా?

- కోనసీమ అభివృద్ధికి ఏం చేశారు!
- సీసీఆర్ నిధుల లెక్కేమిటి!
- ఓఎన్‌జీసీ అధికారులపై ధ్వజమెత్తిన ప్రజలు
- ఓడలరేవులో ప్రజాభిప్రాయ సదస్సు



ఓడలరేవు ప్రజాభిప్రాయ సదస్సులో పాల్గొన్న జేసీ నిషాంతి తదితరులు

ఉప్పలగుప్తం/ అమలాపురం రూరల్: '' కృష్ణా గోదావరి బేసిన్ (కేజీ బేసిన్) గత కొన్ని సంవత్సరాలుగా మీ చమురు సంస్థలకు సంపదనిచ్చే అక్షయ పాత్రగా మారింది. వేలాది కోట్ల రూపాయల చమురు, సహజ వాయువును తరలించుకుపోతున్నారే తప్ప కోనసీమ అభివృద్ధికి మీరు చేసింది ఏమీ లేదు. నిబంధనల మేరకు ఇవ్వాల్సిన కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్ఆర్) నిధులను పూర్తిగా ఖర్చు చేస్తున్నారా, ప్రైవేటు చమురు సంస్థలే కాకుండా ప్రభుత్వ రంగ సంస్థలైన ఓఎన్‌జీసీ, గెయిల్ కూడా ప్రజాభివృద్ధిని పట్టించుకోవటం లేదు. మీ సంస్థల వల్ల కాలుష్యంతో మా పచ్చని కోనసీమ కరువు ప్రాంతంగా మారి పర్యావరణ పరంగా చాలా నష్టపోయే అవకాశం ఉంది'' అంటూ వివిధ గ్రామాల ప్రజలు, స్థానిక ప్రజా ప్రతినిధులు చమురు సంస్థల అధికారులపై ధ్వజమెత్తారు.

ఓడలరేవులో సదస్సు

అల్లవరం మండలం ఓడలరేవు గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్‌షోర్ బ్లాకుల ప్రతిపాదనకై మంగళవారం గ్రామంలోని బీవీఎస్ కళాశాల మైదానంలో పర్యావరణ ప్రజాభిప్రాయ సదస్సును స్థానికులు, ప్రజాప్రతినిధులు, జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, ఆర్డీవో కె.మాధవి సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఓఎన్‌జీసీ అధికారులు మాట్లాడుతూ ఓడలరేవులో రూ.4,406 కోట్లతో నూతన చమురు క్షేత్ర నిర్మాణాన్ని చేపడుతున్నామని వివరించారు. దీనిలో చంద్రిక, జీఎస్ 49 అనే క్షేత్రాల పరిధిలో నూతనంగా రెండు మానవ రహిత ప్లాట్‌ఫామ్స్ 10 చమురు బావులను, 109 కిలోమీటర్ల మేర ఆఫ్‌షోర్‌లో, 3 కిలోమీటర్ల మేర భూమిపైన పైపులైను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇవి సముద్రంలో 3 నుంచి 30 కిలోమీటర్ల పరిధిలో దూరంలో ఉండి 7 మీటర్ల నుంచి 350 మీటర్ల లోతులో ఉంటాయని వివరించారు. దీనికి సంబంధించి ఓ ప్రైవేటు సంస్థతో నీరు, గాలి, శబ్దం, నేల, వృక్ష సంపదలపై 12 శాంపిళ్ల చొప్పున సర్వే చేయించామని, ఆ సర్వే అన్నీ విధాలుగా అనుకూలంగా ఉన్నాయని వివరించారు.

స్థానికుల ఆగ్రహం

కొన్ని సంవత్సరాలుగా గ్రామం నుంచి చమురు సహజ వాయువును తీసుకు పోతున్నా.. గ్రామాన్ని ఏం అభివృద్ధిని చేశారని స్థానికులు ప్రశ్నించారు. ఆఫ్‌షోర్, ఆన్‌షోర్ ప్రాంతాల్లో డ్రిల్లింగ్ చేసి చమురు తీస్తున్నారే తప్ప ఆ క్షేత్రాలను పూడ్చడం లేదని, దాన్ని ఎటువంటి ప్రకృతి వైపరీత్యాలు రావని హామీ ఇవ్వగలరా అని నిలదీశారు. ఈ మధ్యకాలంలో ఓడలరేవు గ్రామంలో సముద్రం కిలోమీటరు ముందుకు వచ్చి మీ ప్లాంటు గోడను సైతం తాకిందని, దానికి ఏం చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. చమురు సంస్థల నుంచి వచ్చే చమురు తెట్టితో మత్స్యసంపద తీవ్రంగా దెబ్బతింటోందని, తాబేళ్ల అధికంగా చనిపోతున్నాయన్నారు. నగరం, పాశర్లపూడి గ్రామాల్లో జరిగిన బ్లోఅవుట్ ప్రమాదాలు మా గ్రామంలో జరగవని మీరు హామీ ఇవ్వగలరా అని గ్రామస్తులు ప్రశ్నించారు. గ్రామస్తులకు, మండల వాసులకు బీమా సౌకర్యం కల్పిస్తున్నారా అని అడిగారు.

గ్రామస్తుల డిమాండ్లు

గ్రామస్తులు మాట్లాడుతూ సంస్థకు వచ్చే ఆదాయాన్ని ఇతర ప్రాంతాల్లో కాకుండా 25 శాతం వాటాను గ్రామానికి, మండలానికి, జిల్లా అభివృద్ధికి ఖర్చు చేయాలన్నారు. అలాగే గ్రామంలో 30 పడకల ఆసుపత్రిని నిర్మించాలని, మత్స్యకారులకు వేట నష్టపరిహారంగా నెలకు రూ.15 వేలు చెల్లించాలని, కాలుష్య నియంత్రణకు మొక్కలను అధికంగా పెంచాలని, స్థానికులకు టెక్నికల్, నాన్ టెక్నికల్ ఉద్యోగాలను కల్పించాలని, శుభ్రమైన తాగునీటిని అందించాలని డిమాండ్ చేశారు. కానీ ఓఎన్‌జీసీ అధికారులు అవేమీ పట్టించుకోలేదు. దీంతో ప్రజాభిప్రాయ సేకరణకు పిలిచి సమస్యలను ఏమాత్రం పట్టించుకోలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఓఎన్‌జీసీ జనరల్ మేనేజర్ ప్రభుదాస్ గుప్తా, ప్లాంటు మేనేజర్ ఫణీంద్ర బాబు, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, సర్పంచ్ మల్లాడి మంగాయమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు పాల శ్రీలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించాలి



చమురు నిక్షేపాలను తరలించుకు పోతున్నారేగానీ ఈ ప్రాంతాన్ని ఏం అభివృద్ధి చేశారు. మీ వాహనాలతో అమలాపురంతో పాటు కోనసీమలో తీవ్ర ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. జాయింట్ కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపి భారీ వాహనాలకు రోడ్లు అనుగుణంగా ఉన్నాయో లేవో సర్వే చేయించాలి. ఓఎన్‌జీసీ వాహనాలు తిరగటానికి బోడసకుర్రు నేషనల్ హైవే నుంచి ఏటిగట్టు మీదుగా నాలుగు లైన్ల రోడ్డును ఏర్పాటు చేసుకోవాలి. నది, సముద్రం కలిసే చోటు డ్రెజ్జింగ్‌లు చేయించి మత్స్యసంపదకు అనుగుణంగా ఫిషింగ్ హార్బర్‌ను నిర్మించాలి. ప్రాజెక్ట్ అంచనా వ్యయంలో రూ.100 కోట్లను జిల్లా కేంద్రానికి ఇచ్చి అభివృద్ధికి సహకరించండి.

– అయితాబత్తుల ఆనందరావు, ఎమ్మెల్యే, అమలాపురం

అనేక ప్రమాదాలు



చమురు సంస్థల నిక్షేపాల వల్ల కోనసీమలో జరిగిన ప్రమాదాలు ఇంకా మా కళ్లముందే కనిపిస్తున్నాయి. మీరు చెప్పిన జాగ్రత్తలు ఏమీ ఆచరణలో సాధ్యం కావటం లేదు. ఏదైనా సమస్య వస్తే ఎవరితో చర్చించాలో అర్థం కావట్లేదు. ఇన్నాళ్లుగా చమురు తరలించుకునిపోతున్నా గ్రామాన్ని ఏ విధమైన అభివృద్ధి చేయలేదు. ఇప్పటికైనా గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి చేయకపోతే ఉద్యమం చేస్తాం.

– పినపోతు రామకృష్ణ, ఓడలరేవు

పొంచిఉన్న ముప్పు



చమురు సంస్థలు చేసే డ్రిల్లింగ్ పనుల వల్ల తీర ప్రాంత గ్రామాలకు ముప్పు పొంచి ఉంది. బావుల నుంచి చమురు తోడుకున్న తర్వాత ఆ ఖాళీలో ఎటువంటి ఫిల్లింగ్ రసాయనాలు పూడ్చటం లేదు. గతంలో జరిగిన ఓ సమావేశంలో జేఎన్‌టీయూ సంబంధించిన ప్రొఫెసర్లు కొందరు గతం కంటే ప్రస్తుతం భూమి ఒకటిన్నర అడుగు కిందకు దిగుబడిందని వెల్లడించారు. సముద్రం కంటే డ్రెయిన్లు పల్లం కావటంతో వ్యవసాయ క్షేత్రాలు సైతం దెబ్బతింటున్నాయి.

– పి.వెంకటేష్, కొమ్మరిగిరిపట్నం, అల్లవరం మండలం

ఆక్టోపస్ సిబ్బంది మాక్ డ్రిల్



మాక్‌డ్రిల్‌లో పాల్గొన్న ఆక్టోపస్ కమెండోలు

మామిడికుదురు: ఉగ్రవాదులు దాడి చేస్తే ఎలా ఎదుర్కోవాలనే అంశంపై అవగాహన కల్పించేందుకు నగరం గ్రామంలోని తాటిపాక జీసీఎస్ వద్ద ఆక్టోపస్ సిబ్బంది మంగళవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. జీసీఎస్‌కు చెందిన ఉన్నత ఉద్యోగిని ఉగ్రవాదులు కిడ్నాప్ చేస్తే, ఎలా కాపాడాలనే దానిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆక్టోపస్ ఎస్పీ ఎం.నాగేంద్ర సారథ్యంలో 40 మంది కమెండోలు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. తాటిపాక జీసీఎస్ చుట్టూ పోలీసులతో పహారా ఏర్పాటు చేశారు. అంబులెన్సులు, స్థానిక వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. 40 మంది సుశిక్షితులైన కమెండోలు అత్యాధునిక ఆయుధాలతో జీసీఎస్‌లోకి ప్రవేశించి సుమారు నాలుగు గంటల పాటు ఆపరేషన్ కొనసాగించారు. నలుగురు ఉగ్రవాదులను అదుపులోకి తీసుకోవడం తదితర అంశాలను మాక్‌డ్రిల్‌లో ప్రదర్శించారు. ఓఎన్‌జీసీ ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ఈ మాక్‌డ్రిల్ జరిగింది.

బాలాత్రిపుర సుందరి అమ్మవారికి రూ.9 లక్షల ఆదాయం

బోట్‌క్లబ్(కాకినాడ సిటీ): నగరంలోని సూర్యారావుపేటలో ఉన్న బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయ హుండీలను మంగళవారం దేవదాయ, ధర్మాదాయ శాఖ కాకినాడ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వడ్డి ఫణీంద్రకుమార్ సమక్షంలో లెక్కించారు. మొత్తం 40 రోజులకు రూ.9 లక్షల ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈఓ ఉండవల్లి వీర్రాజు తెలిపారు. హుండీల లెక్కింపులో ఆలయ ప్రధాన అర్చకుడు చెరుకూరి సుబ్రహ్మణ్యం, ఉత్సవ కమిటీ చైర్మన్ గ్రంధి బాబ్జి, యూనియన్ బ్యాంకు సూర్యారావుపేట సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

కోనసీమకు కొబ్బరి బోర్డు ప్రాంతీయ కార్యాలయం

- కేశనపల్లిలో కొబ్బరి ఆధారిత ఉత్పత్తుల కేంద్రం
- ఎమ్మెల్యే దేవ వరప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వర ప్రసాద్, చిత్రంలో సీడీబీ డిప్యూటీ డైరెక్టర్ కుమార వేలు

మలికిపురం: కొబ్బరి అభివృద్ధి బోర్డు ప్రాంతీయ కార్యాలయాన్ని విజయవాడ నుంచి కోనసీమకు తీసుకొస్తామని ఎమ్మెల్యే, విశ్రాంత ఐఏఎస్ అధికారి దేవ వరప్రసాద్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం కేశనపల్లిలో కొబ్బరి రైతులు, జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కోనసీమలో కొబ్బరికి ఊపిరి పోసేలా కేశనపల్లిలో కొబ్బరి ఆధారిత ఉత్పత్తుల కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. దీనికి ముఖ్యమంత్రి చంద్రబాబు సుముఖంగా ఉన్నారని, 25 ఎకరాలను సేకరించాలని సూచించినట్టు తెలిపారు. కోనసీమలో కొబ్బరి ఆధారిత పరిశ్రమలలో కొన్నయినా ఏర్పాటు చేస్తే ధరతో పాటు ఉపాధి అవకాశాలు కూడా మెరుగవుతాయన్నారు. భూమి సేకరించిన తర్వాత కేంద్ర ప్రభుత్వం రూ.15 కోట్ల వరకూ సాయం అందిస్తుందన్నారు. అలాగే కొబ్బరి ఉత్పత్తుల తయారీ, మార్కెట్ సౌకర్యం వంటి వాటిని ప్రభుత్వం చూసుకుంటుందన్నారు. రాజోలు దీవిలోని శంకరగుప్తం మేజర్ డ్రైనేజీ పరివాహక ప్రాంతంలో కొబ్బరి చెట్ల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామన్నారు.

కొబ్బరి నిల్వ కేంద్రాలకు సబ్సిడీ

చైన్నైకి చెందిన సీడీబీ డిప్యూటీ డైరెక్టర్ కుమార వేలు మాట్లాడుతూ కొబ్బరి నిల్వ కేంద్రాల ఏర్పాటుకు 75 శాతం సబ్సిడీ అందిస్తున్నామని, కొబ్బరి ఆహార పరిశ్రమలకు కూడా దీన్ని వర్తింపజేస్తామన్నారు. ఆర్‌ఆర్ స్కీమ్ కింది హెక్టార్‌కు రూ.55,500 సాయం అందిస్తున్నట్లు వివరించారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి రమణ మాట్లాడుతూ కొబ్బరి అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు కేంద్రం సబ్సిడీ ఇస్తోందన్నారు. జిల్లా పరిశ్రమల శాఖ మేనేజరు ప్రసాద్ మాట్లాడుతూ ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుని ఔత్సాహికులకు పరిశ్రమల స్థాపనకు సహకరిస్తామన్నారు. డీఆర్‌డీఏ పీడీ శివశంకర ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధి హామీ ద్వారా కొబ్బరి తోటల అభివృద్ధికి సహకరిస్తామన్నారు. సర్పంచ యెనుముల నాగు అధ్యక్షతన జరిగిన సభలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, నైనాల వేణుగోపాల్, ఎంపీటీసీ రాపాక సత్యనారాయణ పాల్గొన్నారు.వివిధ మండలాల ఉంచి వచ్చిన రైతులు తమ సమస్యలను వివరించారు.

రాజకీయ కక్షతోనే నా కుమారుడిపై కేసు

- న్యాయం కోసం కోర్టులో పోరాడతా
- మాజీ మంత్రి పినిపే విశ్వరూప్



రావులపాలెంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి విశ్వరూప్, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

రావులపాలెం: రాజకీయ కక్షతోనే తన కుమారుడు శ్రీకాంత్‌ను కేసులో ఇరికించారని మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. రావులపాలెంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రెండున్నరేళ్ల క్రితం దుర్గాప్రసాద్ అనే ఒక వ్యక్తి హత్యకు సంబంధించిన కేసులో ఎఫ్ఐఆర్‌లో కానీ, అనుమానితుల్లో కానీ తన కుమారుడి పేరు లేదన్నారు. అయినా రాజకీయ కక్షతో, తనను ఇబ్బంది పెట్టాలని ఉద్దేశంతోనే శ్రీకాంత్‌ను ఆ కేసులో పెట్టారన్నారు. దైవదర్శనం కోసం వెళ్లిన తన కుమారుడిని తమిళనాడులోని మధురైలో అరెస్టు చేశారన్నారు. ఈ నెల 19వ తేదీ ఉదయం ఈ విషయం తెలిసిన వెంటనే తన కుమారుడికి ఫోన్ చేశానని, తనకు ఏమీ సంబంధం లేదని బయలుదేరి వచ్చేస్తానని చెప్పాడన్నారు. పోలీసులు ఫోన్ టాపింగ్ ద్వారా లొకేషన్‌ను ట్రేస్ చేసి, తన కుమారుడిని అక్కడ అరెస్ట్ చేశారన్నారు. ఎవరెన్ని కక్షసాధింపు చర్యలకు పాల్పడినా.. కోర్టుపై తనకు నమ్మకం ఉందని, న్యాయం కోసం పోరాటం చేస్తామన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, అముడా మాజీ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్ రాజు, జిల్లా వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం అధ్యక్షుడు కప్పల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతీ ఉత్సవ్ పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: ఆకొండి సింహాచలం సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డిసెంబర్ 8, 9, 10 తేదీల్లో స్థానిక యర్రమల్లివారి వీధిలోని హనుమాన్ మందిర్ వద్ద జరగనున్న సంస్కృతీ ఉత్సవ్–2024 కార్యక్రమ పోస్టర్లను మంగళవారం సాయంత్రం ఆవిష్కరించారు. హనుమాన్ మందిర్ వద్ద మాజీ కౌన్సిలర్ ఆశెట్టి ఆదిబాబు చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. ట్రస్ట్ చైర్మన్ ఆకొండి పవన్ కుమార్ మాట్లాడుతూ ఏటా డిసెంబర్‌లో వచ్చే హనుమద్వ్రతం సందర్భంగా సంస్కృతీ ఉత్సవ్ వేడుకలు నిర్వహిస్తామని, గత 18 ఏళ్లుగా ఇలా జరుపుతున్నట్టు తెలిపారు కోనసీమ జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలలు, కళాశాలలు విద్యార్థులు వివిధ రకాల పోటీల్లో పాల్గొంటారన్నారు. భగవద్గీత శ్లోకాలు, భక్తి పాటలు, ఆధ్యాత్మిక ప్రసంగాలు, వేషధారణలు తదితర పోటీలు నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 98854 50524, 81065 76555 నంబర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఆకొండి రవీంద్ర, దేవపూజ్యుల ప్రసాద్, బాబీ, శివ కృష్ణ పాల్గొన్నారు.

నేడు, రేపు పలు రైళ్లు రద్దు

రాజమహేంద్రవరం సిటీ: దానా తుపాను హెచ్చరికల నేపథ్యంలో బుధ, గురువారాల్లో జిల్లా మీదుగా నడిచే పలు రైళ్లను రద్దు చేసినట్టు రైల్వే అధికారులు మంగళవారం ప్రకటించారు. భారీ వర్షాలు కురుస్తాయనే హెచ్చరికలతో ముందస్తు జాగ్రత్తగా ఈస్ట్ కోస్ట్ రైల్వే నుంచి నడిచే సుమారు 20 రెగ్యులర్ ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేసినట్టు చెప్పారు. ఆయా రైళ్లలో రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణికులకు పూర్తి సొమ్ము వాపసు చేసేందుకు ఏర్పాట్లు చేసినట్టు వివరించారు. రద్దయిన రైళ్ల వివరాలను ప్రయాణికులు తెలుసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

బాణసంచా దుకాణాల లైసెన్సులపై సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో మాధవి, చిత్రంలో డీఎస్పీ ప్రసాద్

అమలాపురం టౌన్: దీపావళికి బాణసంచా దుకాణాలకు లైసెన్సుల జారీ ప్రక్రియను ఈ నెల 28వ తేదీ నాటికి పూర్తి చేయాలని అమలాపురం ఆర్డీవో కె.మాధవి ఆదేశించించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్‌తో కలిసి డివిజన్‌లోని పోలీసు, రెవెన్యూ, అగ్నిమాపక, విద్యుత్ తదితర శాఖల అధికారులతో మంగవారం సాయంత్రం సమీక్షించారు. ఆర్డీవో మాట్లాడుతూ అధికారులందరూ లైసెన్సులు పొందనున్న దుకాణాల్లో తనిఖీలు చేయాలన్నారు. ఎక్కడా ప్రమాదాలకు తావు లేకుండా అందరూ ఆనందంగా జరుపుకొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. డీఎస్పీ ప్రసాద్ మాట్లాడుతూ దీపావళి దుకాణాలకు లైసెన్సుల జారీపై విధి విధానాలను సూచించారు. రెవెన్యూ, పోలీసు, అగ్ని మాపక అధికారులు నుంచి కూడా ఆర్డీవో సూచనలు, సలహాలు స్వీకరించారు. అమలాపురం సీఐ పి.వీరబాబు, అగ్నిమాపక దళాధికారి కె.మురళీ కొండబాబు మాట్లాడారు. సమావేశంలో అమలాపురం, ముమ్మిడివరం సీఐలు, అగ్ని మాపక దళాధికారులు, డివిజన్‌లోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు 370 కేంద్రాలు

- రైతులకు కనీస మద్దతు ధర
- కలెక్టర్ మహేష్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కోసం జిల్లాలో 370 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి కొనుగోలు కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతుసేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలుకు 370 కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. నాణ్యత ప్రమాణాలకు లోబడి ఉన్న ధాన్యానికి కనీస మద్దతు ధర కల్పించడం జరుగుతుందన్నారు. ఆలమూరు, మండపేట మండలాల్లో నవంబరు మొదటి వారంలో ధాన్యం నూర్పిళ్లు జరిగే అవకాశం ఉన్నందున, అక్కడ ముందుగా కేంద్రాలను ప్రారంభించాలన్నారు. రైతు తమకు ఇష్టం వచ్చిన మిల్లుకు ధాన్యాన్ని సరఫరా చేసుకోవచ్చన్నారు. రెవెన్యూ సిబ్బందిని కస్టోడియన్ అధికారులుగా మిల్లుల వద్ద నియమించాలని, సచివాలయ సిబ్బందిని జీపీఎస్ ట్రాకింగ్ మానిటరింగ్ కోసం ఏర్పాటు చేయాలన్నారు. సమస్యలను పరిష్కరించేందుకు కమాండ్ కంట్రోల్ రూమ్‌తో పాటుటెలికాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తామన్నారు. క్వింటాల్ సాధారణ రకం ధాన్యానికి రూ.2300, 75 కేజీల బస్తాకు రూ.1725, గ్రేడ్ ఏ రకానికి రూ.2320, 75 కేజీలకు రూ.1740ను కనీస మద్దతు ధరగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికలకు షెడ్యూల్

జిల్లాలో 83 నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైందని కలెక్టర్ మహేష్ కుమార్ తెలిపారు. దీనికి సంబంధించి ఓటరు జాబితా సిద్ధం చేయడం కోసం ప్రతి మండలానికి నీటి వినియోగదారుల సంఘం పరిధిలో సంబంధిత తహసీల్దార్, డీటీలను ఆథరైజ్డ్ అధికారిగా, ఆయకట్టు వివరాలు చూడటానికి నీటిపారుదలశాఖ తరపున సహాయ కార్యనిర్వాహక ఇంజినీర్లను నియమించామన్నారు. నీటి వినియోగదారుల సంఘాల పోలింగ్ నవంబర్ 21 నుంచి 23 వరకూ, డిస్ట్రిబ్యూటరీ కమిటీల పోలింగ్ 24 నుంచి 26 వరకూ, ప్రాజెక్టు కమిటీల పోలింగ్ 27న జరుగుతుందన్నారు.

మంత్రి సుభాష్ జీవితం అందరికీ తెలుసు

- వైఎస్సార్ సీపీ నాయకులపై కక్షసాధింపు చర్యలు
- ధ్వజమెత్తిన కో ఆర్డినేటర్ సూర్యప్రకాశ్



విలేకరులతో మాట్లాడుతున్న సూర్యప్రకాశ్

రామచంద్రపురం: రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ గతాన్ని గుర్తుపెట్టుకుని మాట్లాడాలని, నాలుగు నెలల క్రితం వరకూ ఆయన ఎలా ఉన్నారో ప్రజలందరికీ తెలుసునని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ ధ్వజమెత్తారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. మంత్రి సుభాష్ ప్రోద్బలంతోనే మాజీ మంత్రి విశ్వరూప్ కుమారుడు శ్రీకాంత్‌పై అన్యాయంగా కేసు నమోదు చేసి, అరెస్టు చేశారన్నారు. అమలాపురంలో రౌడీషీటర్లు ఉన్నారని, వారిని త్వరలోనే అరెస్టు చేస్తామని చెబుతున్న మంత్రి సుభాష్ గతంలో వృత్తి కూడా తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. నాలుగు నెలల ముందు వరకు రౌడీషీటర్‌గా ఉంటూ, గంజాయి వ్యాపారం చేసుకుంటూ అమలాపురం, రామచంద్రపురంలోని రౌడీషీటర్లను పెంచి పోషించింది సుభాషేనన్నారు. రామచంద్రపురంలో ప్రస్తుతం కూటమి పార్టీలైన జనసేన, టీడీపీ నేతలు కనిపించడం లేదని, కేవలం రౌడీషీటర్లు మాత్రమే మంత్రి వెంట ఉంటున్నారన్నారు. మంత్రి సుభాష్‌పై 13 కేసులున్నాయని, ఆ విషయాన్ని ఆయనే స్వయంగా ఎన్నికల అఫిడవిట్లో పేర్కొన్నారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులపై కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. సమావేశంలో రామచంద్రపురం ఎంపీపీ అంబటి భవానీ, పార్టీ నేతలు వాసంశెట్టి శ్యామ్, మాతా మురళీ, ఇంత సంతోషం, పెట్టా శ్రీనివాసరావు, బత్తుల అప్పారావు , పోతంశెట్టి గోపాలకృష్ణ, మట్టా బాబులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

టెన్నిస్ క్రీడాకారుల ఎంపికలు



అండర్ 14 విభాగంలో రాష్ట్రస్థాయి టెన్నిస్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం అండర్ 14, 17, 19 విభాగాల్లో టెన్నిస్ క్రీడాకారుల ఎంపికలు ఉత్సాహంగా జరిగాయి. వీటిని ఏపీలాన్ టెన్నిస్ సంఘ కార్యదర్శి పీవీ రామ్ కుమార్ ప్రారంభించారు. బాలురు, బాలికల జట్లను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు.

= అండర్ 14 బాలికల విభాగంలో పి.లోచన (సామర్లకోట), ఎన్.మానవీదేవి (కాకినాడ), కె.తేజశ్రీ (రాజమహేంద్రవరం), ఎం.ధరణి (రాజమహేంద్రవరం), బి.తేజశ్రీ (కాకినాడ), బాలుర విభాగంలో కేఎస్ ప్రతీక్ (కాకినాడ), జి.నిఖిలేష్ (కాకినాడ), ఎన్‌టీఎస్‌టీ సుభాష్ (కాకినాడ), వై.ఇషాన్ (రాజమహేంద్రవరం), ఎస్.నాగచరణ్ (కాకినాడ), ఎస్‌వీవీ జోషి (రామహేంద్రవరం) ఎంపికయ్యారు.


- అండర్ 17 బాలుర విభాగంలో ఎస్.కృష్ణ సాహిత్ (కాకినాడ), ఎస్ఎండీ ఫైజల్ (రాజమహేంద్రవరం), టీకే కౌషిక్ (కాకినాడ), పి.లోకేష్ (కాకినాడ), ఎన్‌జేఎస్‌వీ నేత్ర (కాకినాడ), ఎస్.జైన్ (కాకినాడ)లు ఎంపికయ్యారు. బాలికల విభాగంలో జి.శేషసాయి , జైన అయాన్ , డి. ఆశ్రిత , ఎస్ఎస్ అన్విత , సీహెచ్ఎల్వీ మనస్వి (కాకినాడ)లు ఎంపికయ్యారు.
- అండర్ 19 బాలుర విభాగంలో పీఆర్‌కే నీరజ్, ఎస్ఎస్ సాకేత్, ఆర్‌డీఎస్ తనిష్క, కేపీ కుమార్, పి.ప్రణవ్ కృష్ణ (కాకినాడ)ను ఎంపిక చేశారు., బాలికల విభాగంలో ఎం.మైత్రి లేఖన (కాకినాడ), కె.దేవి (పిఠాపురం), పి.పుష్పలత (చొల్లంగి), ఆర్ వీర శ్రావణి (చొల్లంగి), పీఎస్ఎల్ అభిజ్ఞ (కాకినాడ) ఎంపికయ్యారు. ఈనెల 28, 29, 30 తేదీలలో కాకినాడ డీఎస్ఏలో జరిగిన జరిగే రాష్ట్రస్థాయి లాన్ టెన్నిస్ ఎస్‌జీఎఫ్ఐ పోటీలలో జిల్లా తరఫున వీరు పాల్గొంటారు.

విద్యార్థిని మృతిపై కేసు

ఆలమూరు: అనుమానాస్పద స్థితిలో విద్యార్థిని మృతి చెందిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై ఎం.అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. మడికి శివారు చిలకలపాడుకు చెందిన చెక్కపల్లి వెన్నెల (15) సమీపంలోని చెముడులంకలోని ఒక ప్రైవేట్ కార్పొరేట్ స్కూల్లో పదోతరగతి చదువుతోంది. ఈ నెల 18వ తేదీ తెల్లవారుజామున ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందింది. కార్పొరేట్ స్కూల్ యాజమాన్యం ఒత్తిడి, వేధింపుల వల్లే తమ కుమార్తె మృతి చెందిందని తండ్రి బాబీ మంగళవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా.. విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మండల విద్యాశాఖ స్పందించి జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. డీవైఈఓ నరసింహ ఫణి మంగళవారం సాయంత్రం వెన్నెల మృతిపై విచారణ జరిపారు. సహచర విద్యార్థులను ప్రశ్నించి వివరాలను నమోదు చేసుకున్నారు.

భవితకు పునాది

- ఎఫ్ఎల్ఎన్ అమలుకు విద్యాశాఖ కసరత్తు
- 1, 2 తరగతుల విద్యార్థుల ప్రగతికి చర్యలు
- ఉపాధ్యాయులకు శిక్షణ ప్రారంభం



ఎఫ్ఎల్ఎన్ లోగో

రాయవరం: ఒక భవనాన్ని నిర్మించేటప్పుడు పునాది బలంగా వేయాలి. అప్పుడే ఆ పునాదిపై ఎన్ని అంతస్తుల నిర్మాణమైనా చేయవచ్చు. ఇదే విధానం విద్యాభ్యాసంలో విద్యార్థికి వర్తిస్తుంది. ఒక విద్యార్థికి పూర్వ ప్రాథమిక, ప్రాథమిక స్థాయిలో పునాది బలం ఉంటేనే అతడు అభ్యసనా సామర్థ్యాలను సులభంగా సాధిస్తాడు. అందుకే ప్రాథమిక స్థాయిలో విద్యార్థి అభ్యసనా సామర్థ్యాల పెంపుదలకు ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యుమరసీ (ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమాన్ని విద్యాశాఖ, సమగ్ర శిక్షా సంయుక్తంగా చేపట్టాయి. సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (సాల్ట్)లో భాగంగా ఎస్‌జీవో సంస్థ ప్రథమ్ భాగస్వామ్యంతో ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని ప్రాథమిక పాఠశాలల్లో అమలుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు కసరత్తు చేస్తోంది. అందులో భాగంగా ఇప్పటికే డీఆర్పీలకు శిక్షణ ఇవ్వగా, ఇప్పుడు శిక్షణ పొందిన డీఆర్పీలు ఒకటో తరగతికి బోధన చేసే ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు.

విద్యా సంస్కరణలు

నూతన విద్యా విధానం–2020లో భాగంగా ప్రభుత్వం పలు విద్యా సంస్కరణలను ప్రవేశ పెట్టింది. నిపుణ్ భారత్ లక్ష్యాలను సాధించే క్రమంలో భాగంగా ఎర్లీ చైల్డ్ సెంటర్ ఎడ్యుకేషన్ (ఈసీసీఈ)ని ప్రవేశ పెట్టారు. ఇందులో ప్రీ ప్రైమరీ 1, ప్రీ ప్రైమరీ 2ను అమలు చేస్తున్నారు. ప్రీ ప్రైమరీ 1లో 3 నుంచి 4 ఏళ్ల చిన్నారులకు, ప్రీ ప్రైమరీ 2లో 4 నుంచి 5 ఏళ్ల చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యాబోధన చేస్తారు.

ఎఫ్ఎల్ఎన్ ఎందుకంటే..

ప్రతి విద్యార్థి ఆయా తరగతుల అభ్యసనా సామర్థ్యాలను పెంపొందించుకోవాలి. అయితే పదో తరగతికి చేరుకుంటున్న విద్యార్థులకు కూడా తెలుగు, గణితంలో ప్రాథమిక భావనలు తెలియడం లేదన్న కఠోర వాస్తవాలను అసర్, నాస్, శ్లాస్ తదితర నివేదికలు బహిర్గతం చేశాయి. దీంతో ప్రభుత్వం పూర్వ ప్రాథమిక, ప్రాథమిక స్థాయిలో విద్యార్థులు అభ్యసనా సామర్థ్యాలను సాధించేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు చేపడుతుంది. అందులో భాగంగానే ఫౌండేషన్ లిటరసీ, న్యుమరసీ కార్యక్రమం చేపట్టింది. విద్యార్థి 1, 2 తరగతులు పూర్తి చేసి మూడవ తరగతిలో చేరే సమయానికి తెలుగులో చదవడం, రాయడం, వినడం, మాట్లాడడం రావాల్సి ఉంటుంది. గణితంలో చతుర్విధ ప్రక్రియలైన కూడికలు, తీసివేతలు, గుణకారం, భాగహారంపై నైపుణ్యాలను సాధించాలి.

ప్రీ ప్రైమరీలోనే పాఠశాల సంసిద్ధతా కార్యక్రమాలను అమలు చేస్తారు. ఐదేళ్లు నిండిన చిన్నారులకు ప్రైమరీ తరగతులు నిర్వహిస్తారు. ప్రీ ప్రైమరీ, ప్రైమరీలో 1, 2 తరగతులకు ఫౌండేషన్ లిటరసీ, న్యుమరసీ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా 2026–27 విద్యా సంవత్సరానికి రెండు నుంచి మూడో తరగతికి వెళ్లే విద్యార్థులందరూ ఆయా తరగతుల అభ్యసనా సామర్థ్యాలను కచ్చితంగా పొందాలి.



శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు

బ్యాచ్‌ల వారీగా శిక్షణ

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి ఒకటో తరగతి విద్యార్థులకు బోధన చేసే ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు. పూర్తి స్థాయి రెసిడెన్షియల్ విధానంలో ఉపాధ్యాయులకు ఇచ్చే శిక్షణకు తూర్పుగోదావరి జిల్లా కొండగుంటూరులోని సత్యసాయి పరిమళ పాలిటెక్నిక్ కళాశాలను శిక్షణా కేంద్రంగా రాష్ట్ర స్థాయి అధికారులు ఎంపిక చేశారు. మొదటి స్పెల్‌లో 90 మంది ఒకటో తరగతి బోధన చేసే ఉపాధ్యాయులు శిక్షణ పొందుతున్నారు. ప్రతి బ్యాచ్‌కు ఆరు రోజుల పాటు శిక్షణ జరుగుతుంది. జిల్లాకు చెందిన 1,285 మంది ఉపాధ్యాయులకు 14 బ్యాచ్‌ల్లో శిక్షణ ఇవ్వనున్నారు. గతేడాది ఆగస్టులో ఎఫ్ఎల్ఎన్ జ్ఞానప్రకాష్ సర్టిఫికెట్ కోర్సులో శిక్షణ పొందిన డీఆర్పీలు, కేఆర్పీలు ఒకటవ తరగతి బోధన చేసే ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు. గతేడాది ఆగస్టులో జిల్లా నుంచి 66 మంది డీఆర్పీలుగా శిక్షణ పొందారు. వారిని బ్యాచ్‌ల వారీగా శిక్షణ ఇచ్చేందుకు పంపిస్తారు.

సద్వినియోగం



ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యుమరసీలో భాగంగా ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకుంటాం. ఒకటవ తరగతి విద్యార్థికి పునాది చాలా అవసరం . ఆ సమయంలోనే చదవడం, రాయడం, గణితంలో ప్రాథమిక భావనలను తెలియజేయాలి. వీటి కోసం ఈ శిక్షణ చాలా ఉపయోగ పడుతుంది.

– జోస్యుల రాధాకృష్ణవేణి, సెకండరీ గ్రేడ్ టీచర్, ఎంపీయూపీ స్కూల్, లొల్ల, రాయవరం మండలం

చాలా కీలకం



ఎనిమిది సంవత్సరాలు వచ్చే సరికీ పిల్లల్లో ప్రాథమిక విద్యకు పునాది పడాలి. ఆ సమయమే వారి పెరుగుదల, అభివృద్ధికి చాలా కీలకం. దానివల్ల చిన్నారుల భవిష్యత్తు అభ్యసనానికి పునాది ఏర్పడుతుంది. శిక్షణలో తెలుసుకున్న విషయాలను పిల్లలకు బోధించడం వల్ల వారి ప్రగతికి బాటలు పడతాయి.

– గుబ్బల దుర్గాప్రసాద్, డీఆర్పీ, మలికిపురం మండలం

ఉపాధ్యాయులకు శిక్షణ



గతేడాది ఆగస్టులోనే జ్ఞాన ప్రకాష్, జ్ఞాన జ్యోతి ప్రోగ్రామ్‌లో భాగంగా మండలానికి ఆరుగురు డీఆర్పీలకు శిక్షణనిచ్చాం. ఇప్పుడు ఒకటవ తరగతి బోధన చేసే ప్రతి ఉపాధ్యాయుడికి శిక్షణనిస్తున్నాం. శిక్షణను సద్వినియోగం చేసుకుంటే పునాది అభ్యసనం మెరుగవుతుంది.

– అరవ ప్రభాకర్, శిక్షణ కార్యక్రమ రాష్ట్ర పరిశీలకుడు, విజయవాడ

బోధనకు ఉపయోగం



ఎఫ్ఎల్ఎన్ శిక్షణ పూర్తిగా రెసిడెన్షియల్ విధానంలో జరుగుతుంది. బ్యాచ్‌కు 250 మంది ఎస్‌జీటీలకు శిక్షణ ఇస్తున్నాం. ఆరు రోజుల పాటు జరిగే శిక్షణకు అవసరమైన ఏర్పాట్లను ఉన్నతాధికారులు ఏర్పాటు చేశారు. కచ్చితంగా ఈ శిక్షణ ఉపాధ్యాయులకు బోధనలో ఉపకరిస్తుంది.

– గౌరీ శంకర్, ఏఎంవో, తూర్పుగోదావరి జిల్లా

మరణంలోనూ ఒకరికొకరు

- అంబాజీపేటలో దంపతుల ఆత్మహత్య
- ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలే కారణం
- సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకున్న పోలీసులు



రాంబాబు, నాగమణి దంపతులు (ఫైల్)



నాగమణి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై చైతన్యకుమార్

అంబాజీపేట: అంబాజీపేట పెద్దవీధిలో ఉంటున్న పాలోలు రామసుబ్రహ్మణ్యం (రాంబాబు) (60), నాగమణి (57) దంపతులు మంగళవారం ఉదయం ఆత్మహత్య చేసుకున్నారు. ఆర్థిక సమస్యలు, అనారోగ్య, వ్యక్తిగత కారణాలతో చనిపోతున్నామని సూసైట్ రాశారు. దీంతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలముకున్నాయి. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. రాంబాబు, నాగమణి దంపతులు వారి రెండో కుమార్తె వంకాయల సునీత, మనవరాలు మానసతో కలిసి ఉంటున్నారు. సునీత, మానస రెండు రోజుల క్రితం బంధువు పెళ్లికి విశాఖపట్నం వెళ్లారు. ఇంటిలో ఎవరూ లేని సమయంలో రాంబాబు దంపతులు ఆత్మహత్యకు చేసుకున్నారు. సుబ్రహ్మణ్యం మేడ కింద మెట్ల వద్ద ఉరి వేసుకోగా, నాగమణి మంచంపై అచేతనంగా పడి ఉన్నారు. సమీపంలోని బంధువులు ఈ విషయాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు.

వ్యాపారంలో నష్టాలు

రాంబాబు గతంలో స్థానిక బేతాళ స్వామి గుడి సమీపంలోనూ, అయినవిల్లి మండలం సిరిపల్లి వద్ద సుబ్రహ్మణ్యేశ్వర ఆగ్రో ప్రాడక్ట్స్ పేరుతో కొబ్బరి నూనె, పామాయిల్ వ్యాపారం చేసేవారు. వాటితో పాటు అంబాజీపేట మండలం కముజువారి లంక వద్ద పామాయిల్ నర్సరీని నిర్వహించేవారు. అయితే వ్యాపారంలో నష్టాలు రావడంతో అన్నీ విక్రయించేశారు. ఏడేళ్లుగా ఆదిత్య గార్మెంట్స్ పేరుతో వస్త్ర వ్యాపారాన్ని ప్రారంభించారు. దీనిలోనూ నష్టాలు రావడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు.

పదేళ్ల క్రితం కుమారుడి కుటుంబం ఆత్మహత్య

రాంబాబు దంపతుల కుమారుడు కిరణ్, కోడలు లక్ష్మీ శ్వేత, మనవరాలు శ్రావణి, తొమ్మిది నెలల మనవడు పదేళ్ల క్రితం రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఆత్మహత్య చేసుకున్నారు. అప్పటి నుంచి దంపతులిద్దరూ మనోవేదనతో గడుపుతున్నారు. కరోనా అనంతరం వారి ఆరోగ్య పరిస్థితి మరింత క్షీణించింది. మరో పక్క ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి.

మీ కూతుళ్లుగా చూసుకోండి

తన కుమార్తె సునీత, మనవరాలు మానసలను ఏలోటు లేకుండా చూసుకోవాలని తన తమ్ముళ్లయిన కృష్ణ, శ్రీనులను రాంబాబు సూసైట్ నోట్‌లో కోరారు. తమకు వారు ఎన్నో సేవలు చేశారన్నారు. తాను, తన భార్య ఆర్థికంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ఆరోగ్యం కూడా సహకరించడం లేదన్నారు. కాగా.. విషయం తెలిసిన వెంటనే నగరం ఎస్సై ఎ.చైతన్యకుమార్, అంబాజీపేట పోలీస్ సిబ్బంది సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేశారు. రాంబాబు రాసిన సూసైడ్ నోట్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వై.సూర్యనారాయణ తెలిపారు. మృతదేహాలను అమలాపురం ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు.

లిక్కర్ ఫ్యాక్టరీలో సీఐడీ తనిఖీలు

పెదపూడి: అనపర్తి మండలం కొప్పవరం గ్రామంలోని బీడీహెచ్ ఆగ్రో వెంచర్స్ ప్రైవేటు లిమిటెడ్ (లిక్కర్ ఫ్యాక్టరీ)లో వైజాగ్ నుంచి వచ్చిన సీఐడీ డీఎస్పీ నాగేంద్ర భూపాల్ ఆధ్వర్యంలో సీఐడీ, ఎక్సైజ్ శాఖాధికారులు తనిఖీలు నిర్వహించారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి పరిశ్రమలో సోదాలు కొనసాగుతున్నాయి. అధికారులు పలు కీలక, హార్డ్ డిస్కులు, ఫైళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇక్కడ బీరుతో పాటు ఆల్కాహాలు కూడా తయారు చేస్తున్నారు. అయితే దీనిపై మీడియాకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు.

ట్రాక్టర్ ఢీకొని యువకుడి మృతి



బాలసుబ్రహ్మణ్యం (ఫైల్)

రాయవరం: ట్రాక్టర్ ఢీకొని పసలపూడి గ్రామానికి చెందిన చిటికెన బాల సుబ్రహ్మణ్యం (21) మృతి చెందాడు. వెల్డింగ్ పనులు చేసుకునే బాలసుబ్రహ్మణ్యం మంగళవారం తెల్లవారుజామున టిఫిన్ తినేందుకు రామచంద్రపురం వెళ్లాడు. అక్కడి నుంచి తిరిగి వస్తుండగా వెదురుపాక నుంచి పశువుల వ్యర్థాలతో వెళుతున్న ట్రాక్టర్ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు రామచంద్రపురం ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతి చెందాడు. ఎస్సై పి.బుజ్జిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు అంతర్ జిల్లా దొంగల అరెస్టు

- 110 గ్రాముల బంగారు ఆభరణాల స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీఐ విద్యాసాగర్

ఆలమూరు: రాష్ట్రంలోని వివిధ జిల్లాలో చోరీలకు పాల్పడుతూ ఆరేళ్లుగా తప్పించుకు తిరుగుతున్న ఇద్దరు అంతర జిల్లా దొంగలు ఎట్టకేలకు చిక్కారు. వారు ఇప్పటి వరకూ చేసిన చోరీల సొత్తును రికవరీ చేసేందుకు రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్.విద్యాసాగర్ నేతృత్వంలోని పోలీసులు చర్యలు చేపట్టారు. ఆలమూరు పోలీసు స్టేషన్‌లో ఎస్సై ఎం.అశోక్ ఆధ్వర్యంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ విద్యాసాగర్ వివరాలు వెల్లడించారు. జొన్నాడకు చెందిన చిటికెన సోమరాజు నెల రోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతున్న తన భార్య సీతను వైద్యం కోసం హైదరాబాద్ తీసుకువెళ్లారు. అక్కడే తన పెద్ద కుమార్తె ఇంటిలో ఉంటూ ఆమెకు వైద్యం చేయిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 17న మెయిన్ రోడ్డు సమీపంలోని సోమరాజు నివాసానికి రోజూ మాదిరిగానే పనిచేసే మహిళ వచ్చింది. కానీ ఆ ఇంటి తలుపులు తెరిచి ఉండడం, వస్తువులన్నీ చిందరవందరగా ఉండడంతో హైదరాబాద్‌లోని సోమరాజుకు సమాచారం ఇచ్చింది. దీంతో హుటాహుటిన ఇంటికి చేరుకున్న సోమరాజు, కుటుంబ సభ్యులు ఇంట్లోని వస్తువులన్నీ పరిశీలించారు. బీరువాలోని సుమారు రూ.23 లక్షల విలువైన 312 బంగారం అపహరణకు గురైనట్లు గుర్తించారు.

పోలీసుల దర్యాప్తు

బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై అశోక్ కేసు నమోదు చేశారు. కొత్తపేట డీఎస్పీ వై.గోవిందరాజు ఆదేశాల మేరకు సీఐ విద్యాసాగర్ దర్యాప్తు చేపట్టారు. స్థానిక ఐడీ పార్టీ సహకారంతో గ్రామంలోని సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించారు. ఇప్పటికే 60కి పైగా కేసులున్న పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరంలోని గుడుపూడికి చెందిన పందిరి వెంకట నారాయణ (నారిగాడు), 25కు పైగా కేసులున్న నెల్లూరులోని కోటమెట్ట షాదీ మందిర్‌కు చెందిన షేక్ అహ్మద్ బాషాను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ప్రస్తుతం రూ 7.7 లక్షల విలువైన 110 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన బంగారాన్ని నెల్లూరులో ఒక ప్రైవేటు బ్యాంకులో తాకట్టు పెట్టినట్లు నిందితులు తెలిపారు. నిందితులిద్దరిని బుధవారం స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరు పరచి కస్టడీకి కోరనున్నట్లు సీఐ విద్యాసాగర్ తెలిపారు. చోరీ కేసు ఛేదనలో తీవ్రంగా శ్రమించిన డి.సుబ్రహ్మణ్యం, ఎస్.బ్లెసమ్, పి.గంగాధర్, కె.రాంబాబు, బి.నెహ్రూ, బి.శ్రీనివాసరావు, కేవీవీ రవికుమార్, వి.చిట్టిబాబును సీఐ విద్యాసాగర్ అభినందించారు.



ఆలమూరులో విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న సీఐ విద్యాసాగర్

కమనీయం.. బ్రహ్మోత్సవం



స్వామి, అమ్మవార్లకు అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

- వైభవంగా వాడపల్లి వెంకన్న బ్రహ్మోత్సవాలు
- తరలివచ్చిన భక్తులు

ఆత్రేయపురం: వాడపల్లిలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా కొనసాగాయి. వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య భక్తజన కోటి తన్మయత్వంతో వేడుకలను తిలకించింది. దేవదాయ ధర్మదాయశాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ నల్లం సూర్యచక్రధరరావు దంపతులు స్వామికి పట్టువస్త్రాలను సమర్పించారు. సరస్వతి అలంకరణలో హంస వాహనంపై స్వామిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం నుంచి పూజలు, హోమాలు జరిపారు. భద్రాచలంలోని సీతారామస్వామి ఉత్సవ మూర్తులను ఆలయానికి తీసుకుని వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఖండవల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఆలయ ఈఓ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎస్సై రాము ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పిస్తున్న ఆలయ ఈఓ దంపతులు



ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు